# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 31 ఆగస్టు 2025 | www.balagamtv.com | పేజీలు 4


## సెప్టెంబర్ 7న అరుదైన బ్లడ్‌మూన్

### భారతదేశంతో పాటు ఆసియా, ఆఫ్రికా, ఆస్ట్రేలియాలో

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఖగోళ ప్రేమికులకు శుభవార్త. వచ్చే నెల సెప్టెంబర్ 7న ఒక అరుదైన సంపూర్ణ చంద్రగ్రహణం జరగనుంది. ఈ సందర్భంగా చంద్రుడు ఎరుపు వర్ణంలో మెరుస్తూ కనిపించనున్నాడు. దీనినే బ్లడ్‌మూన్ అంటారు. ఈ గ్రహణం భారతదేశంతో పాటు ఆసియా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా దేశాల్లో స్పష్టంగా కనిపించనుంది. అమెరికా ఖండంలో మాత్రం ఈ గ్రహణం కనిపించదని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. ఇది ఈ ఏడాది రెండో చంద్రగ్రహణం కావడం విశేషం. మార్చి 14న జరిగిన మొదటి గ్రహణం భారత్‌లో కనిపించలేదు. అయితే ఈసారి దేశవ్యాప్తంగా స్పష్టంగా కనిపించనుంది, అందువల్ల సూతకాలం కూడా వర్తించనుందని పండితులు పేర్కొన్నారు. దీనికి అనుగుణంగా ఆలయాలు మూతపడనున్నాయి.

గ్రహణ కాల సూచిక (భారత కాలమానం ):

పెనుంబ్రల్ గ్రహణం ప్రారంభం: రాత్రి 8:58

పాక్షిక గ్రహణం ప్రారంభం: రాత్రి 9:57

మిగితా 2వ పేజీలో

# బీసీలకు రిజర్వేషన్ల అమలుకు జీవో

- 2018 పంచాయతీరాజ్ చట్టానికి సవరణ
- రిజర్వేషన్ల పరిమితి ఎత్తివేత
- కోర్టు ఆదేశాల మేరకు గడువులోగా స్థానిక సంస్థలకు ఎన్నికలు
- నేడు అసెంబ్లీ ముందుకు ఘోష్ కమిషన్ నివేదిక
- వరద నష్టంపై సెప్టెంబర్ 4న ఉన్నతాధికారులతో సమావేశం
- నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్ట్‌కు ఆమోదం
- క్యాబినెట్ నిర్ణయాలను వెల్లడించిన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్




బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్ల విషయంలో ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు రాష్ట్రంలో అమలులో ఉన్న 50 శాతం రిజర్వేషన్ పరిమితిని ఎత్తివేసే దిశగా రాష్ట్ర క్యాబినెట్ కీలకంగా ముందడుగు వేసింది. ఈ నిర్ణయం ద్వారా రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాలకు విద్యా, ఉద్యోగ అవకాశాల్లో మరింత ప్రాతినిధ్యం లభించనుంది.సోమవారం నాడు జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై విస్తృతంగా చర్చించబడింది. అనంతరం బీసీ వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రత్యేక జీవో జారీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న 50 శాతం రిజర్వేషన్ పరిమితుల వల్ల, బీసీలకు తగిన ప్రాతినిధ్యం దక్కడంలేదని ప్రభుత్వం గమనించింది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా, ఈ సీలింగ్ పరిమితిని తొలగించే దిశగా నడిచేలా చర్యలు చేపట్టింది.

ముందుగా పంచాయతీ రాజ్ చట్టంలోని సెక్షన్ 285(ఏ)లో సవరణలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా బీసీలకు స్థానిక సంస్థలలో, పాలనలో సరైన ప్రాతినిధ్యం లభించేందుకు మార్గం సుగమమవుతుంది. ఈ నిర్ణయం అమలుకు సంబంధించి అన్ని ప్రాథమిక సిద్ధాంతాలు సిద్ధం చేయాలని సంబంధిత శాఖలకు ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం.

**ఇక** కాళేశ్వరంపై ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌ను అసెంబ్లీ వేదికగా కడిగి పారేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి... మంత్రులకు దిశా నిర్దేశం చేశారు. తద్వారా ఆ పార్టీని ఇరకాటంలో పడేయాలని ఆయన వారికి సూచించారు. అసెంబ్లీలో కాళేశ్వరం కమిషన్ రిపోర్టును ప్రవేశపెట్టకుండా చూడాలంటూ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు హైకోర్టులో మధ్యంతర పిటిషన్‌ను దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఆ పిటిషన్‌ను సోమవారం విచారిస్తామంటూ న్యాయస్థానం తెలిపిన నేపథ్యంలో...ఒకరోజు ముందుగానే (ఆదివారం) సభలో కాళేశ్వరంపై చర్చించటం ద్వారా బీఆర్ఎస్‌కు ఎలాంటి అవకాశం లేకుండా చేద్దామంటూ మంత్రివర్గ సమావేశంలో సీఎం వ్యాఖ్యానించినట్టు సమాచారం. ఒకవేళ సోమవారం హైకోర్టులో విచారణకు వచ్చినా, అప్పుడు ప్రభుత్వానికి ఎలాంటి ఇబ్బందీ ఉండబోదంటూ ఆయన చెప్పినట్టు తెలిసింది. పీసీ ఘోష్ కమిషన్ నివేదికను...పీసీసీ కమిషన్ అంటూ బీఆర్ఎస్ ఎద్దేవా చేయటాన్ని క్యాబినెట్ తీవ్రంగా పరిగణించింది. టిట్ ఫర్ ట్యాట్ అనే పద్ధతిలో గులాబీ పార్టీ వైఖరిని శాసనసభలో ఎండగట్టాలని సీఎం ఈ సందర్భంగా మంత్రులకు చెప్పినట్టు సమాచారం. నివేదికలోని అంకెలు, సంఖ్యలు, గణాంకాలు, వాస్తవ పరిస్థితులను సూటిగా, స్పష్టంగా, ప్రజలకు అర్థమయ్యేలా విడమరిచి చెప్పాలంటూ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి ఆయన సూచించారు. సభలో పవర్ పాయింట్ ప్రజంటేషన్‌కు పట్టుబడుతున్న బీఆర్ఎస్‌పై ఎదురుదాడికి దిగాలంటూ రేవంత్, తన మంత్రివర్గ సహచరులకు సూచించారు. ఈ క్రమంలో ఆదివారం అసెంబ్లీ ముందుకు కాళేశ్వరం కమిషన్ నివేదిక రానుంది. ఆ ప్రతులను సభ్యులందరికీ పంపిణీ చేసి, అనంతరం చర్చను ప్రారంభించనున్నారు. అనంతరం తీసుకోవాల్సిన చర్యలపై అసెంబ్లీలో తీర్మానించే అవకాశం ఉంది. దీనిపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)

మిగితా 2వ పేజీలో

## సౌమ్యుడు, మితభాషి మాగంటి గోపీనాథ్

- సీఎం రేవంత్‌రెడ్డి
- సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి
- అసెంబ్లీ ఘననివాళి, నేటికి వాయిదా



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ శాసనసభ్యుడు మాగంటి గోపీనాథ్ అకాల మరణం పట్ల శాసనసభ తీవ్ర సంతాపం ప్రకటించింది. మాగంటి గోపీనాథ్ మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన సంతాప తీర్మానం శాసనసభ ఆమోదించింది. తీర్మానం ప్రవేశపెట్టిన సందర్భంగా ముఖ్యమంత్రి గారు మాట్లాడుతూ, మాగంటి గారు అందించిన సేవలను, వారితో ఉన్న వ్యక్తిగత అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు."విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో చురుకుగా ఉన్నారు. 1983 లో ఎన్ టీ రామారావు గారు ప్రారంభించిన తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా పనిచేశారు. 1985 నుంచి 95 వరకు తెలుగు యువత అధ్యక్షుడిగా, ఎన్టీఆర్ గారికి విశ్వాస పాత్రుడిగా పనిచేశారు. హైదరాబాద్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ సభ్యుడిగా, వినియోగదారుల ఫోరం సభ్యుడిగా సేవలు అందించడమే కాకుండా, సినీ నిర్మాతగా కూడా రాణించారు. 2014, 2018, 2023 మూడు సార్లు హ్యాట్రిక్ సాధించిన అతి తక్కువ మంది శాసనసభ్యుల్లో గోపీనాథ్ గారు ఒకరు.

జూన్ 8 న గోపీనాథ్ అకాల మరణం వారి కుటుంబానికి తీరని దుఃఖాన్ని మిగిల్చింది. రాజకీయ విధానాల్లో మార్పు వచ్చినప్పటికీ వ్యక్తిగత మిత్రుత్వం, వ్యవహార శైలిలో ఎలాంటి మార్పు లేదు. సౌమ్యుడు, మితభాషి, ప్రజలతో వారికున్న సత్సంబంధాల వల్లే మూడుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. నగర ప్రజలకు, జూబ్లీహిల్స్ నియోజకవర్గం ప్రజలకు తీరని లోటు. శాసనసభ వారి కుటుంబానికి అండగా నిలబడుతుంది. గోపీనాథ్ గారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాం.." అని ముఖ్యమంత్రి సంతాప తీర్మానంలో పేర్కొన్నారు.

శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ...గోపీనాథ్ మరణం దిగ్భ్రాంతికరమన్నారు. ఆయన మానవతావాది, మృదుస్వభావి, నిజాయితీపరుడు అని కొనియాడారు. ఆయన కుటుంబంతో తనకున్న సంబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సభలో గోపీనాథ్ లేని లోటు కనిపిస్తోందన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు, జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బీఆర్ఎస్ సభ్యులు కే.తారకరామారావు(కేటీఆర్) మాట్లాడుతూ...తమ పార్టీ హైదరాబాద్ నగర అధ్యక్షులుగా ఉన్న గోపీనాథ్ మృతికి సంతాపం ప్రకటించాల్సి రావడం బాధాకరంగా ఉందన్నారు. నగరంలో కటౌట్ల కల్చర్ తీసుకొచ్చింది ఆయనేనన్నారు. ఆయన ఆరోగ్య, వ్యక్తిగత, కుటుంబ విషయాలను పెద్దగా ఎవరితోనూ పంచుకునేవారు కాదనీ, నిరంతరం ప్రజా సేవ గురించే ఆలోచించేవారని కొనియాడారు. బతుకమ్మ పండుగ సందర్భంగా ప్రతి ఏటా మహిళలకు చీరలను పంచుతూ వస్తున్నారనీ, ఆయన స్ఫూర్తితోనే రాష్ట్ర వ్యాప్తంగా ఆ కార్యక్రమాన్ని విస్తరించామని తెలిపారు. గోపీనాథ్ కుటుంబానికి తమ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. సీపీఐ సభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ..గోపీనాథ్ మృతి

మిగితా 2వ పేజీలో

## సురవరంకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు ఇస్తాం




- ప్రజాస్వామ్య పరిరక్షణకు
- లౌకికశక్తులంతా కలిసి రావాలి
- కమ్యూనిస్టుల సిద్ధాంతాన్ని అందరికీ అర్థమయ్యేలా చేస్తాం
- సంస్మరణ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాంతం పని చేసిన కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి పేరు చరిత్రలో శాశ్వతంగా ఉండే విధంగా రాష్ట్ర మంత్రిమండలిలో చర్చించి ఒక మంచి నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. "సిద్ధాంతాలు చెప్పడమే కాదు. నమ్మిన సిద్ధాంతం కోసం 65 సంవత్సరాలు నిబద్ధతతో జీవించడం ద్వారా సురవరం కి ఆ గౌరవం దక్కింది. వారు ఏ జెండాను మోశారో, ఏ జెండా మోయడం గొప్పగా భావించారో.. చివరి శ్వాస తర్వాత కూడా ఆ జెండా నీడనే విశ్రమించడం అత్యంత అరుదు.

ప్రజలతో గుర్తింపబడిన మహనీయుల పేర్లు ఈ రాష్ట్రంలో శాశ్వతంగా నిలవాలి. అందుకే తెలుగు విశ్వ విద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డి పేరు, కోఠీ మహిళా విద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరు, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హాండ్లూమ్ టెక్నాలజీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును పెట్టుకున్నాం. సామాన్య ప్రజల్లో చైతన్యం నింపి గోల్కొండ కోటను పాలించిన సర్దార్ సర్వాయి పాపన్న అందరికీ స్ఫూర్తిగా నిలవాలని ట్యాంక్‌బండ్‌పై వారి విగ్రహాన్ని ప్రతిష్ఠించుకుంటున్నాం. ఒక ప్రాంతం నుంచి సమాజంలో గుర్తింపు పొందిన ఉన్నప్పుడు చెప్పుకోవడానికి ఆ ప్రాంత వాసులకు గర్వంగా ఉంటుంది. మొదటి తరంలో సురవరం ప్రతాపరెడ్డి, బూర్గుల రామకృష్ణా రావు గారు, రెండో తరంలో జైపాల్ రెడ్డి గారు, సురవరం సుధాకర్ రెడ్డి గారు మహబూబ్‌నగర్ జిల్లాకు వన్నె తెచ్చారు. వారెప్పుడు సమాజంలో గౌరవం పొందుతూనే ఉంటారు.

సురవరం విజయలక్ష్మి చిన్న కోరికలు కోరారు. వారి గౌరవం ఆలంపూర్ శాసనసభ నియోజకవర్గానికే కాదు. సురవరం సుధాకర్ రెడ్డి గౌరవం, రాష్ట్ర స్థాయిలో ఉండే విధంగా శాశ్వతంగా గుర్తుంచుకునే విధంగా మంత్రివర్గంలో ఒక మంచి నిర్ణయం తీసుకుంటాం. ప్రస్తుతం సమాజంలో ప్రజాస్వామిక మూల సిద్ధాంతానికి విరుద్ధంగా పెరిగిపోతున్న విపరీత పోకడలను అడ్డుకోవలసిన అవసరం ఉంది. ప్రజల ప్రాథమిక హక్కులను హరించే ప్రమాదకర పరిస్థితులను తలెత్తుతున్నాయి. ప్రజలను చైతన్య పరిచే ఆలోచన ఎవరూ చేయడం లేదు. అందుకోసం ఐక్య కార్యాచరణ నిర్మించుకోవాలి. అప్పుడే సురవరం లాంటి నేతకు ఘనమైన నివాళి.." అని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సంస్మరణ సభలో మంత్రి జూపల్లి కృష్ణారావు , సురవరం విజయలక్ష్మి గారు, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా గారు, సీనియర్ నాయకులు కె నారాయణ, కేవీపీ రామచందర్ రావు గారు, రామకృష్ణ గారు, శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు గారితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, కమ్యూనిస్టు నాయకులు పాల్గొన్నారు.

## నేడు అసెంబ్లీకి కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ శాసనసభ మళ్లీ హాట్ టాపిక్‌లతో చప్పుళ్లతో మార్మోగనుంది. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై వచ్చిన కమిషన్ నివేదిక చుట్టూ రాజకీయ వాతావరణం మరింత వేడెక్కేలా ఉంది. జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలోని కమిషన్ సమర్పించిన 650 పేజీల నివేదికలో పూర్వ సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలే ఈ ప్రాజెక్టు శాపంగా మారాయని తేల్చడంతో, దీనిపై హై-వోల్టేజ్ వార్ ఖాయం అయ్యింది.ప్రభుత్వంలో ఉన్న కాంగ్రెస్, ఇప్పటికే 'కాళేశ్వరం కూలేశ్వరం' అనే నినాదంతో బీజేపీ, బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు చేస్తోంది. ప్రాజెక్టు నాణ్యతపై బహిరంగంగా ప్రశ్నలు వేస్తోంది. బీఆర్ఎస్ మాత్రం వర్షాల్లో ప్రాజెక్ట్ ఏమీ చెక్కు చెదరలేదంటూ సోషల్ మీడియాలో ఫోటోలు షేర్ చేస్తూ ప్రత్యుత్తరంగా హల్‌చల్ చేస్తోంది.

ఇక ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా యూరియా కొరత తీవ్ర స్థాయికి చేరుకుంది. గంటల తరబడి రైతులు క్యూల్లో నిల్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సరిపడా యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు ఆందోళన చేస్తున్నారు. ఈ అంశం కూడా అసెంబ్లీ సమావేశాల్లో చర్చకు కేంద్రబిందువయ్యే అవకాశముంది. బీఆర్ఎస్ యూరియా కొరతపై రైతులకు మద్దతుగా ఆందోళనలు చేస్తుండగా, కాంగ్రెస్ మాత్రం ఇది కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యమేనని చెబుతోంది. రెండూ ఒకరిపై ఒకరు ఆరోపణలు మోస్తున్న ఈ అంశం సభలో తీవ్ర వాగ్వాదానికి దారి తీసేలా కనిపిస్తోంది.

స్థానిక సంస్థల ఎన్నికలు సెప్టెంబర్ 30లోపు జరగాలన్న హైకోర్టు ఆదేశాల నడుమ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రంతో పంచాయితీ పడుతోంది. రాష్ట్రపతి ఆమోదం రాకపోవడంతో జీవో ద్వారా కోటా అమలు చేస్తామన్న ఆలోచనను కాంగ్రెస్ పరిశీలిస్తోంది. ఇక బీఆర్ఎస్ మాత్రం, బీసీలను రేవంత్ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శిస్తోంది. దీనిపై కాంగ్రెస్ వర్గాలు బీఆర్ఎస్ పైనే తిరగబడుతున్నాయి "మీరు అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు నిర్ణయం తీసుకోలేదో చెప్పండి" అంటూ బీఆర్ఎస్‌ను నిలదీస్తున్నాయి.


తాజాగా కురుస్తున్న భారీ వర్షాలు రాష్ట్ర వ్యాప్తంగా పంట నష్టం, ఆస్తి నష్టాన్ని తెచ్చిపెట్టాయి. వర్షపు నీటితో రోడ్లు దెబ్బతిని ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారత వాతావరణ శాఖ 72 గంటల ముందే హెచ్చరించినా, రేవంత్ ప్రభుత్వం స్పందించలేదని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. అంతేకాదు, ప్రజలు సహాయం కోసం ఆర్తనాదాలు చేసినా ప్రభుత్వం మొద్దుబారిపోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూసీ ఆధునీకరణపై సమీక్ష జరిపిన సమయంలో వర్షాల వల్ల రాష్ట్రం దెబ్బతింటుండడాన్ని బీఆర్ఎస్ తప్పుపడుతోంది. ఈ నాలుగు కీలక అంశాలు ు కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్, యూరియా కొరత, బీసీ రిజర్వేషన్లు, వర్షపాతం నష్టాలు అన్నీ కలిసి అసెంబ్లీని ఈసారి వేదికపై కాకుండా, రాజకీయ యుద్ధ భూమిగా మార్చేలా ఉన్నాయి. అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్వాదం తప్పదని విశ్లేషకులు భావిస్తున్నారు.



## చైనాలో ప్రధాని మోడీ

బలగం టీవీ, బీజింగ్

షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సుకు హాజరయ్యేందుకు ప్రధాని నరేంద్ర మోడీ శనివారం తియాంజిన్‌లోని బిన్హాయ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగారు. చైనా, భారత్ అధికారులు ఆయనకు కరచాలనాలతో సాదరపూర్వక స్వాగతం పలికారు. స్థానిక కళాకారులు సాంస్కృతిక నృత్యాన్ని ప్రదర్శించారు. మోడీ తన రెండు రోజుల చైనా పర్యటనలో భాగంగా ఎస్‌సీఓ సదస్సుకు హాజరు కావడంతో పాటు దేశాధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌లతో ద్వైపాక్షిక సమావేశాలు జరుపుతారు. చైనా రావడానికి ముందు మోడీ జపాన్‌లో రెండు రోజుల పాటు పర్యటించారు. కాగా చైనాలో దిగిన వెంటనే మోడీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఓ పోస్ట్ పెట్టారు. 'చైనాలోని తియాంజిన్‌లో దిగాను. ఎస్‌సీఓ సదస్సులో జరిగే చర్చలు, వివిధ దేశాల నేతలతో జరిపే సమావేశాల కోసం ఎదురు చూస్తున్నాను' అని తెలిపారు. మోడీ, జిన్‌పింగ్‌లు చివరిసారిగా గత సంవత్సరం అక్టోబర్ 23న రష్యాలో జరిగిన బ్రిక్స్ సదస్సు సందర్భంగా సమావేశమయ్యారు. 2018 తర్వాత చైనాలో మోడీ పర్యటించడం ఇదే మొదటిసారి. ఈ పర్యటన ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేస్తుందని పరిశీలకులు అభిప్రాయపడ్డారు.



## గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరాం, అజారుద్దీన్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీల విషయంలో తెలంగాణ క్యాబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరాం, అజారుద్దీన్ పేర్లను ఖరారు చేసింది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ఎన్నికైన ప్రొఫెసర్ కోదండరాం, జర్నలిస్ట్ అమీర్ అలీఖాన్‌ల నియామకాన్ని ఇటీవల సుప్రీంకోర్టు రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం జరిగిన క్యాబినెట్ భేటీలో ఇదే కోటాలో తిరిగి కోదండరాంతో పాటు కొత్తగా అజారుద్దీన్ పేరును క్యాబినెట్ ఖరారు చేసింది.

## యూరియా కొరతపై బీఆర్ఎస్ నిరసన



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న ఎరువుల సంక్షోభంపై గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ నేతలు వినూత్నంగా నిరసన తెలిపారు. తూతూ మంత్రంగా నాలుగురోజులు అసెంబ్లీ నడపడం కాదు, 15 రోజులపాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. కాళేశ్వరంపై వేసింది పీసీ ఘోష్ కమిషన్ కాదని, కాంగ్రెస్ వేసుకున్న పీసీసీ ఘోష్ కమిషన్ అని ఎద్దేవా చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న ఎరువుల సంక్షోభంపైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శనివారం హైదరాబాద్‌లోని గన్ పార్కు వద్ద వినూత్న నిరసన తెలిపారు. గన్ పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద ఖాళీ యూరియా బస్తాలతో నిరసన వ్యక్తం చేశారు. యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలమైందని, యూరియా కొరత తీర్చి రైతులను ఆదుకోవాలంటూ ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న వ్యవసాయ సంక్షోభంపై అసెంబ్లీలో మాట్లాడే అవకాశం ఇవ్వాలన్నారు. శాసనసభను వారికి అనుకూలంగా ఉండేలా నడిపించే రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని, రైతుల సమస్యల పైన, రాష్ట్రంలో ఉన్న ఎరువుల సంక్షోభం పైన మాట్లాడటం లేదన్నారు. 10 సంవత్సరాల పాటు కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఏ రోజూ ఇలాంటి ఎరువుల కొరత రాలేదని, రైతులు క్యూ లైన్లలో నిలబడాల్సిన దుస్థితి రాలేదన్నారు. మరి ఎందుకు ఈరోజు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చెప్పులు, ఆధార్ కార్డులను లైన్లో పెట్టే పరిస్థితి వచ్చిందని ప్రశ్నించారు. పండుగ రోజు కూడా రైతులు ఎరువుల కోసం లైన్లలో నిలబడి, వర్షంలో తడిసి ఇబ్బందులు పడే పరిస్థితి ఎందుకు వచ్చిందని నిలదీశారు. రాష్ట్రంలో ఉన్న వ్యవసాయ సంక్షోభం పై అసెంబ్లీలో చర్చ పెట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. 600కు పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, 75 లక్షల మంది రైతులు అవస్థల్లో

మిగితా 2వ పేజీలో

## బీఏసీ సమావేశం నుంచి బీఆర్ఎస్ వాకౌట్



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో


హైదరాబాద్‌లో జరిగిన బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) సంచలన నిర్ణయం తీసుకుంది. రైతుల సమస్యలు, ముఖ్యంగా యూరియా కొరత మరియు వరదల ప్రభావంపై తక్షణ చర్చ జరపాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నేతలు వాకౌట్ చేశారు. ప్రభుత్వం రైతుల కష్టాలను పట్టించుకోకుండా, ఇతర అజెండాలపై దృష్టి సారిస్తోందని వారు ఆరోపించారు. ఈ వాకౌట్ సమావేశంలో ఉద్రిక్తతను రేపడంతో, రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ, ప్రభుత్వం రైతుల సమస్యలను విస్మరిస్తూ, "వరదల కన్నా బురద జల్లడం"పై ఎక్కువ శ్రద్ధ చూపుతోందని విమర్శించారు. రైతులు ఎదుర్కొంటున్న యూరియా కొరత, వరదల వల్ల పంట నష్టం వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సరిపోవని, ఆదుకునేందుకు నిర్దిష్ట పథకాలు లేవని ఆయన తప్పుబట్టారు.

సమావేశంలో బీఆర్ఎస్ నేతలు తమ అజెండాను గట్టిగా వినిపించేందుకు ప్రయత్నించినప్పటికీ, ప్రభుత్వం తమ డిమాండ్లను పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను చర్చకు తీసుకురాకపోతే సమావేశంలో పాల్గొనడం వృథా అని భావించి వాకౌట్ చేసినట్లు బీఆర్ఎస్ నేతలు తెలిపారు. ఈ నిర్ణయం రాష్ట్రంలో రైతు సంక్షేమంపై ప్రభుత్వ వైఖరిని ప్రశ్నిస్తూ, రాజకీయ ఒత్తిడిని పెంచే అవకాశం ఉంది.

## హైకోర్టుకు హరీష్ రావు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో



కాళేశ్వరం నివేదికను రద్దు చేయాలని కోరుతూ మాజీ మంత్రి, ఎంఎల్ఏ హరీష్ రావు మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. శనివారం హైకోర్టులో ఆయన పిటిషన్ దాఖలు చేశారు. అసెంబ్లీలో కాళేశ్వరం నివేదిక ప్రవేశపెట్టడకుండా చూడాలని, చర్చ, చర్యలపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషన్‌లో కోరారు. అయితే ఈ పిటిషన్ హైకోర్టు రిజిస్ట్రీ వద్ద పెండింగ్‌లో ఉంది. కాగా, గతంలోనే హరీష్ రావు, కెసిఆర్ కాళేశ్వరం నివేదిక రద్దు చేయాలని కోరుతూ వేరువేరుగా హైకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లు విచారించిన ధర్మాసనం కౌంటర్ దాఖలు చేయాడానికి గడువు ఇస్తూ నాలుగు వారాలు వాయిదా వేసింది.

# బీఆర్ఎస్ ప్రజెంటేషన్‌కు అవకాశం ఇవ్వము

- **ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



కాళేశ్వరం ప్రాజెక్టుపై శాసనసభలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తామని బీఆర్ఎస్ నేతలు అడుగుతున్నారని, కానీ తాము అవకాశం ఇవ్వాలనుకోవడంలేదని ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క స్పష్టంచేశారు. శనివారం శాసనసభ లాబీల్లో మీడియాతో ఆయన మాట్లాడారు. అసెంబ్లీలో ప్రతిపక్షాలకు పీపీటీ ఇచ్చే సంప్రదాయంలేదన్నారు. అప్పులపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తున్నదని, తాము అన్ని వివరాలను శాసనసభ వేదికగానే బయటపెడుతామని చెప్పారు. అప్పులపై కడుతున్న వడ్డీ రూ.2300 కోట్లు మాత్రమేనని బీఆర్ఎస్ నేతలు చెప్తున్నారని, అసలు ఎంత కడుతున్నామో వారికి కూడా తెలుసని అన్నారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రాష్ట్ర రాజకీయాల దశాదిశ మార్చనుంది

- **మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని అస్థిర పర్చాలనే బిఆర్ఎస్, బిజెపి కుట్రలను తిప్పికొట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్ శ్రేణులకు పిలుపు ఇచ్చారు. శనివారం షేక్ పేటలో సీసీ రోడ్ ఓపెన్ జిమ్ ఇందిరాగాంధీ కమ్యూనిటీ హాల్‌కు కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో కలసి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రాష్ట్ర రాజకీయాల దశదిశ మార్చబోతుందని, రేవంత్ ప్రభుత్వాన్ని అస్థిర పరచడానికి బిఆర్ఎస్, బిజెపి జెండాలు పక్కన పెట్టి రెండు పార్టీలు ఏకమై కాంగ్రెస్ పార్టీనీ ఓడించాలనీ పన్నే కుయుక్తులను ఓడించి ప్రజా ప్రభుత్వాన్ని జూబ్లీ హిల్స్ ఓటర్లు ఆశీర్వదించాలని మంత్రి తుమ్మల కోరారు.

అబివృద్ధి సంక్షేమ పథకాలతో రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం చక్కని పాలన చేస్తుంటే రాజకీయ స్వార్ధంతో బిఆర్ఎస్, బిజెపి ఉప ఎన్నికల బరిలో ప్రలోబాలతో కులాల కుంపట్లు పెట్టీ గెలవాలనే కుట్రలను వివేకవంతమైన చైతన్యవంతమైన జూబ్లీహిల్స్ ఓటర్లు కాంగ్రెస్ పార్టీనీ గెలిపించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని , జూబ్లీ హిల్స్ ఓటర్లు తీర్పు రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా మారనుందని వెల్లడించారు. కాంగ్రెస్ శ్రేణులు వర్గ విబేధాలు పక్కన పెట్టీ పార్టీ గెలుపుకు కృషి చేయాలని,కష్టపడ్డ వారికి పార్టీలో ప్రాధాన్యం ఉంటుందని మంత్రి తుమ్మల శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారు.

# సౌమ్యుడు, మితభాషి మాగంటి గోపీనాథ్

(మొదటి పేజీ తరువాయి)

బాధాకరమన్నారు. ఆయన మంచి ఆర్గనైజర్ అని చెప్పారు. అందరితోనూ కలివిడిగా ఉండేవారన్నారు. ఎంఐఎం సభ్యులు బలాల మాట్లాడుతూ..మాగంటి సౌమ్యుడనీ, తన పనితాను చేసుకుంటూ పోయేవాడని గుర్తుచేశారు. సాధారణ జీవితం గడుపుతూ జూబ్లీహిల్స్ ప్రజల మనస్సును వరుసగా మూడుసార్లు గెలిచాడన్నారు. బీజేపీ సభ్యులు వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ..ఎన్టీఆర్‌ను గోపీనాథ్ ఆరాధించేవారని గుర్తుచేశారు. ప్రజల గుండెల్లో గోపీనాథ్ చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. సతీమణి సునీత, ముగ్గురు పిల్లలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సంతాప తీర్మానంపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు తుమ్మల నాగేశ్వం ‾రావు, పొన్నం ప్రభాకర్, బీఆర్ఎస్ సభ్యులు తలసాని శ్రీనివాస్, కేపీ.వివేకానంద, ప్రశాంత్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, ముఠాగోపాల్ మాట్లాడారు. అనంతరం గోపీనాథ్ మృతికి శాసనసభ సభ్యులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం సభను ఆదివారం ఉదయం 9 గంటలకు వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రకటించారు.

# యూరియా కొరతపై బీఆర్ఎస్ నిరసన

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నారని ఆరోపించారు. రైతులకు కాంగ్రెస్ చేసిన మోసంపైన అసెంబ్లీలో చర్చ జరగాలన్నారు. ఆరు గ్యారెంటీల నుంచి 420 హామీల అమలు వైఫల్యాల దాకా అన్ని అంశాలపైన చర్చిద్దామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమకు అనుకూలంగా ఉండే ఒకటి రెండు అంశాల పైనే మాట్లాడే ప్రయత్నం చేస్తోందన్నారు. అసెంబ్లీ సమావేశాలంటే ప్రజా సమస్యలపై చర్చించాలని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి సమావేశాలు నిర్వహిస్తారన్నారు. వ్యవసాయ రంగం మొదలుకొని ఫీజ్ రియంబర్స్ మెంట్‌తోపాటు ఏ అంశం పైననైనా సభలో చర్చకు పెడితే ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కాళేశ్వరంతోపాటు అన్ని అంశాలను చర్చించాలంటే కనీసం 15రోజులపాటు అసెంబ్లీని కొనసాగించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ అంశాన్ని సభలో పెట్టినా, అన్నింటికీ సరైన సమాధానం ఇస్తామన్నారు. ఇప్పటికే అసమ్మతి ఎమ్మెల్యేలకు సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోందని, స్పీకర్ ఏ నిర్ణయం తీసుకుంటారో చూడాలన్నారు.

అనంతరం గన్‌పార్కు నుంచి వ్యవసాయ శాఖకు తరలి వెళ్లారు. రైతు సమస్యలు, పంట నష్టం, యూరియా కొరతపై వ్యవసాయ శాఖ కమిషనర్‌కు బీఆర్ఎస్ నేతలు వినతి పత్రం సమర్పించారు. ఆ తర్వాత కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం ముందు బైఠాయించారు. దాంతో కేటీఆర్, హరీశ్‌రావుతోపాటు పలువురు బీఆర్ఎస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అసెంబ్లీ ముగిసిన తర్వాత బీఆర్ఎస్ ఎమ్మెల్యే టీ హరీశ్ రావు కారులో బూర్గుల రామకృష్ణారావు భవన్ వరకు వెళ్లి, హఠాత్తుగా కారుదిగి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంవైపు పరిగెత్తారు. ఆయన వెంట మరికొందరు ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు. హరీశ్‌రావుతో పాటు ఆయన గన్ మ్యాన్లు కూడా సెక్రటేరి యట్‌వైపు పరుగులు తీసారు. అక్కడ పోలీసులకు హరీశ్ రావుకు మధ్య వాగ్వివాదం జరిగింది. అనంతరం ఆయన్ని అరెస్టు చేశారు.

# మాజీ ఎమ్మెల్సీలకు శాసనమండలి సంతాపం

- **సభలో అడుగు పెట్టిన విజయశాంతి, ఏడుగురు కొత్త సభ్యులు**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనమండలి మాజీ సభ్యులు టి.రత్నాకర్, తెలంగాణ శాసనమండలి మాజీ సభ్యులు ఎం.రంగారెడ్డిల మరణం పట్ల రాష్ట్ర శాసనమండలి సంతాపం తెలిపింది. ఈ మేరకు శనివారం శాసనమండలి సమావేశాల మొదటి రోజున మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సంతాప తీర్మాన్ని ప్రవేశపెట్టారు. జనగామ జిల్లా జనగామ గ్రామానికి చెందిన రత్నాకర్‌తో, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన ఎం.రంగారెడ్డిలు ఈ ఏడాది మరణించినట్టు తెలిపారు. అంతకుముందు వారిద్దరు వివిధ హోదాల్లో ప్రజా సేవలందించడంతో పాటు ఎమ్మెల్సీలుగానూ సేవలందించినట్టు వివరించారు. సంతాప సూచకంగా సభ్యులు 2 నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కొత్త సభ్యులను సభకు పరిచయం చేశారు. శనివారం నాటి సభకు ఇటీవల ఎన్నికై వచ్చిన వారిలో అద్దంకి దయాకర్, కేతావత్ శంకర్ నాయక్, విజయశాంతి, నెల్లికంటి సత్యం, పింగిలి శ్రీపాల్ రెడ్డి, అంజిరెడ్డి, మల్క కొమురయ్య, రియాజుల్ ఎఫెండీ ఉన్నారు. వీరిలో ఎంఐఎం పార్టీకి చెందిన రియాజుల్ ఎఫెండీ గతంలో ఎమ్మెల్సీగా సేవలందించారు. ఆయన రెండోసారి ఎన్నికై సభకు హాజరయ్యారు. మిగిలిన వారు మొదటిసారిగా ఎన్నికై సభకు హాజరయ్యారు. అనంతరం చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సభను మంగళవారం ఉదయం 10 గంటలకు వాయిదా వేశారు.

# అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించాలి

అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించాలని బీఏసీ సమావేశంలో సూచించాలని మాజీ మంత్రి టి హరీశ్‌రావు తెలిపారు. శనివారం హైదారాబాద్‌లోని శాసన సభ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. మొదటి ప్రాధాన్యత వరదలపై, రెండో ప్రాధాన్యత యూరియాపై చర్చించాలని కోరామన్నారు. గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని చెప్పారు. విద్యార్థుల మరణంపై చర్చ జరగాలన్నారు. ఫోర్త్‌సిటీ పేరున జరుగుతున్న అక్రమాలు, సీఎం కుటుంబ సభ్యులపై చర్చ కోరామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల పీఆర్సీ, బెనిఫిట్లు, హైడ్రా కూల్చివేతలు, ప్రభుత్వ ఆస్పత్రుల నిర్వహణపై చర్చించాలని డిమాండ్ చేశారు. వీటిపై స్పందించని ప్రభుత్వ తీరుకు నిరసనగా బీఏసీ నుంచి వాకౌట్ చేశామని తెలిపారు. వరద బాధితుల గురించి కాకుండా బురద జల్లే రాజకీయాలు అసెంబ్లీలో మాట్లాడటమేంటని ప్రశ్నించారు. అదే మీకు ముఖ్యమా? అని సీఎంను ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై చర్చించకపోవడమే ప్రజా పాలనా? అని ప్రశ్నించారు. కనీసం 15 రోజులు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీజేపీ, కాంగ్రెస్ రైతుల ఉసురు పోసుకుంటున్నాయని విమర్శించారు.

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో బీసీలకు అన్యాయం చేస్తూ కేసీఆర్ చట్టం చేశారని గుర్తు చేశారు. బీసీలకు న్యాయం చేసే విధంగా చర్య, చర్చ జరగబోతుందన్నారు. ప్రతిపక్షాలు ప్రజా సమస్యలపై చర్చకు సహకరించాలని కోరారు. కేంద్రం నిధుల విషయంలో వివక్ష చూపిస్తున్నదని విమర్శించారు. యూరియా విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకుని, ఆ నిందను తమ ప్రభుత్వంపై వేయటం తగదని హితవు పలికారు.

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ యూరియా కొరతకు కారణం బీజేపీ నేతలేనని చెప్పారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో యూరియా ఇస్తే సపోర్ట్ చేస్తామని బీఆర్ఎస్ చెప్పడాన్ని గుర్తు చేశారు. రాష్ట్రానికి నయాపైసా కూడా కేంద్రం నుంచి తేలేని కిషన్‌రెడ్డి అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరంపై చర్చను పక్కదారి పట్టించేందుకే యూరియా సమస్యను బీఆర్ఎస్ నేతలు ముందుకు తెస్తున్నారని విమర్శించారు.

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ పీసీ ఘోష్ ఇచ్చిన నివేదికతో బీఆర్ఎస్ నేతల్లో వణుకు మొదలైందని తెలిపారు. అందుకే మరో మారు హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ వేశారని గుర్తు చేశారు.

మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందనీ, అందుకే చర్చను తప్పుదారి పట్టించేందుకు బీఆర్ఎస్ నేతలు కుట్ర చేస్తున్నారని విమర్శించారు.

బీజేపీ శాసన సభ పక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రజాసమస్యలపై చర్చించే ధైర్యం ప్రభుత్వానికి లేదని విమర్శించారు. వరదలకు వేల ఎకరాల పంట నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, పైడి రాకేశ్‌రెడ్డి మాట్లాడారు.

# బీసీలకు రిజర్వేషన్ల అమలుకు జీవో

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేయనున్నట్టు సమాచారం. మరోవైపు క్యాబినెట్‌లో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంతోపాటు, ఇటీవలి వర్షాలు, వరదలతో నష్టపోయిన రైతులను ఆదుకోవ డంపైనా చర్చించారు. పంటలు, రోడ్లు, ఇతర నష్టాలతోపాటు గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా అజహరుద్దీన్, కోదండరాం పేర్లను క్యాబినెట్ ఆమోదించి, గవర్నర్‌కు సిఫారసు చేసింది. క్యాబినెట్ సమావేశం ముగిసిన అనంతరం మంత్రివర్గ నిర్ణయాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ సచివాలయంలో మీడియాకు వెల్లడించారు. 'కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని క్యాబినెట్ నిర్ణయించింది. రిజర్వేషన్ల అమలుకు ప్రత్యేక జీవో విడుదల చేస్తాం. ఎస్సీ, ఎస్టీ జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఉంటాయి. 2018 పంచాయతీరాజ్ చట్టంలోని 285(ఏ) చట్టానికి సవరణకు ప్రతిపాదించాం. అలాగే 2019 మున్సిపల్ యాక్ట్‌లోని 50 శాతం సీలింగ్ ఎత్తేయడానికి తెచ్చిన ఆర్డినెన్స్‌ను శాసనసభలో ప్రవేశపెట్టి, అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలను తీసుకుంటాం. సెప్టెంబర్ 30లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఆ ఆదేశాల మేరకు నిర్దేశిత గడువులోగా ఎన్నికలు నిర్వహించాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది...' అని వారు వెల్లడించారు. వర్షాల వల్ల జరిగిన నష్టం అంచనాలపై సెప్టెంబర్ 4న ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఇటీవల భారీ విపత్తు వల్ల పంట, ఆస్తి, రహదారులకు పెద్ద మొత్తంలో నష్టం జరిగిందన్నారు. వీటన్నింటిపై చర్చించి సత్వరం చేపట్టాల్సిన పనులపై నిర్ణయం తీసుకోవడంతోపాటు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని వివరించారు. రాష్ట్రంలో గోశాల పాలసీ, దాని విధివిధానాలపై మంత్రివర్గంలో చర్చించినట్టు తెలిపారు. సమస్యను శాశ్వతంగా పరిష్కరించడం కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు కొలిచే సాంకేతికత, తదితర అంశాలకు సంబంధించిన నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్ట్‌కు మంత్రివర్గంలో ఆమోదం తెలిపారు. 2022–23 రబీ సీజన్ ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయని మంత్రులు తెలిపారు. సీఎంఆర్ కింద ప్రభుత్వానికి 7లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించిన బియ్యం రావాల్సి ఉందన్నారు. గత సర్కార్ హయాంలో జరిగిన అక్రమాలకు సంబంధించి విచారణ చేసి, అవసరమైతే మిల్లర్లపై పీడీ యాక్ట్ పెడతామని ప్రకటించారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా అజహరుద్దీన్, కోదండరాం పేర్లను క్యాబినెట్ సిఫార్సు చేసిందని తెలిపారు. మత్స్య కార్మిక సహకార సంఘాల ఎన్నికలు ఆలస్యమయ్యే అవకాశమున్నందున పర్సనల్ ఇన్‌చార్జీలను నియమించనున్నట్టు పొంగులేటి, పొన్నం ఈ సందర్భంగా వెల్లడించారు.

# సెప్టెంబర్ 7న అరుదైన బ్లడ్‌మూన్

(మొదటి పేజీ తరువాయి)

సంపూర్ణ గ్రహణం ప్రారంభం: రాత్రి 11:30
గరిష్ఠ గ్రహణం: అర్ధరాత్రి 12:11
సంపూర్ణ గ్రహణం ముగింపు: రాత్రి 12:52
పాక్షిక గ్రహణం ముగింపు: తెల్లవారు జామున 1:56
పెనుంబ్రల్ గ్రహణం ముగింపు: ఉదయం 2:55

ఈ మొత్తం గ్రహణం 5 గంటల 27 నిమిషాలపాటు జరుగుతుంది. ఇందులో సంపూర్ణ చంద్రగ్రహణం 82 నిమిషాలు ఉంటుంది.

సంపూర్ణ చంద్రగ్రహణ సమయంలో భూమి, సూర్యుని మరియు చంద్రుడి మధ్యలోకి వస్తుంది. భూమి నీడ (ఉంబ్రా)లోకి పూర్తిగా చంద్రుడు వెళ్లినప్పుడు, భూమి వాతావరణం సూర్యకాంతిని వడపోస్తుంది. ఎరుపు కాంతి మాత్రమే చంద్రుడిపై పడుతుంది, అందువల్ల చంద్రుడు ఎరుపుగా మెరిసిపోతాడు. ఇదే బ్లడ్‌మూన్. ఈసారి గ్రహణ తీవ్రత 1.362గా ఉండటం వల్ల చంద్రుడు భూమి నీడలో మరింత లోతుగా ఉంటుంది. దీనివల్ల ఆయన సాధారణ గ్రహణాలకంటే మరింత ఎరుపుగా మెరుస్తాడని నిపుణులు చెబుతున్నారు.

# రైతును కన్నీళ్లు పెట్టిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం...

- **కనుమరుగు కాక తప్పదు**
- **మానకొండూర్ నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు డాక్టర్ రసమయి**

**బలగం టీవీ, ఇల్లంతకుంట**

రాష్ట్రంలో రైతును కన్నీళ్లు పెట్టిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం కనుమరుగు కాక తప్పదనీ మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. శనివారం ఇల్లంతకుంట మండలం లోని వల్లంపట్ల,దాచారం, బోటి మీది పల్లె గ్రామాలలో వివిధ అనారోగ్య సమస్యలతో, అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబాలను పరమార్శించినారు.అనంతరం రసమయి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తీరు దొంగే దొంగ అన్నట్లుందని కుండపోత వానలో తడుస్తూ రైతులు గంటల కొద్దీ నిలబడి ఆధార్ కార్డులు, పాస్ బుక్కులు, చెప్పులు క్యూలైన్లలో యూరియా బస్తాలు ఇవ్వాలంటూ రైతన్నలు అధికారుల కాళ్లు పట్టుకొని వేడుకున్నది చూస్తుంటే చాలా బాధనిపిస్తుంది అన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న యూరియా అడిగితే పోలీసు లాఠీలతో కొట్టిస్తున్నారని అన్నారు.కాంగ్రెస్ పార్టీ చేతగాని తనం వల్లనే కదా ఈరోజు రైతులకు ఇన్ని కష్టాలు వచ్చినాయి అని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందు చూపు లేకపోవడం వల్లనే కదా రైతులు కన్నీళ్లు పెట్టాల్సి వస్తున్నదని అన్నారు.

బీతులం బంగారం ఇస్తామంటూ ప్రగల్భాలు పలికిన రేవంత్ రెడ్డి,బంగారం మాట దేవుడెరుగు యూరియానే బంగారంగా మార్చిండని అన్నారు.బీగ్రామాలలో విచ్చలవిడిగా మద్యాన్ని ఏరులైపారిస్తున్న రేవంత్ రెడ్డి, యూరియా బస్తాలను అందుబాటులో ఉంచడంలో అట్టర్ ఫ్లాప్ అయ్యిండని,బూటకపు వాగ్దానాలు చేసినంత సులువు కాదు, పరిపాలన చేయడం అంటే నమ్మి నయవంచన చేసినంత సులువు కాదని అన్నారు. తొమ్మిదిన్నరేండ్ల బిఆర్ఎస్ పాలనలో రైతులకు ఏనాడూ యూరియా కొరత రాలేదని ఏనాడూ రోడ్డెక్కాల్సిన దుస్థితి రాలేదని అన్నారు.



రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్లనే, ముఖ్యమంత్రి, వ్యవసాయ మంత్రి చేతగాని తనం వల్లనే రాష్ట్రానికి ఎరువుల కొరత వచ్చిందని ఈరోజు యావత్ రైతాంగాన్ని యూరియా కోసం నడి రోడ్డుపై నిలబెట్టిన దుర్మార్గ చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని అన్నారు.సాగు నీళ్ల ఇవ్వడంలో పంట కొనుగోళ్లలో,500 బోనస్ ఇవ్వడంలో,రైతు భరోసా ఇవ్వడంలో,రైతు రుణమాఫీలో ఫెయిల్ అయిన ప్రభుత్వం కాంగ్రెస్‌బి ప్రభుత్వం ,చివరకు యూరియా సరఫరా చేయడంలో విఫలమై రైతులను కన్నీళ్లు పెట్టిస్తున్న ఈ ప్రభుత్వం ఒక ఫెయిల్యూర్ ప్రభుత్వం అని అన్నారు.మరోపక్క భారీ వర్షాలు కురిస్తే తెలంగాణ రాష్ట్రంలోని కొన్ని పట్టణాలు అతలాకుతలమైతే వారిని పట్టించుకునే నాధుడే కరువైనారని అన్నారు. అందించే విషయంలో కూడా విఫలమైన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు.ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్లా జిల్లా జడ్పీ మాజీ వైస్ చైర్మేన్ సిద్దం వేణు ,బీఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి ఆయా గ్రామాల మాజీ ప్రజా ప్రతినిధులు,నాయకులు, బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## ఇండ్లలో దొంగతనం..

**- వెండితోపాటు బంగారం అపహరణ**

**- ఎస్ఐ రమాకాంత్**

**బలగం టీవీ, బోయినిపల్లి**






బోయినిపల్లి మండలం కొదురుపాకలో గ్రామంలో రెండు ఇండ్లలో చోరీ జరిగినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ప్రకారం బోయిని పల్లి మండల పరిధిలోని కొదురుపాక గ్రామంలో ఈనెల 28 అర్ధరాత్రి సమయంలో తాళం వేసి ఉన్న నాగుల లక్ష్మీ రాజం మరియు ధ్యావనపల్లి సుధాకర్ రావు అనే వ్యక్తుల ఇండ్లలోకి ఎవరో గుర్తు తెలియని దొంగలు చొరబడి నాగుల లక్ష్మీ రాజం యొక్క ఇంటి నుండి 30 తులల వెండి కాలి పట్టీలు, ధ్యావనపల్లి సుధాకర్ రావు ఇంటి నుండి 1 తులం బంగారు గుండ్లు, అర తులం కమ్మల జతలు మరియు 20 తులల వెండి కాలి పట్టీలు దోచుకున్నారాని తెలిపారు. వీటి మొత్తం విలువ సుమారుగా 70 వేల రూపాయలు వరకు ఉంటుందని, చోరీ జరిగిన విషయం తెలుసుకొని ఎస్సై రమాకాంత్ సంఘటన స్థలానికి చేరుకొని అట్టి సంఘటన స్థలాన్ని పరిశీలించి క్లూస్ టీం వారి సహాయంతో క్లూస్ ను సేకరించడం సేకరించినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అట్టి దొంగలను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్టుగా తెలిపినారు.

## జెసిబి సాయంతో చెత్త తొలగించిన పోలీసులు ..

**బలగం టీవీ, బోయినిపల్లి**

గత రెండు రోజులు కురుస్తున్న వర్షాలకు బోయినిపల్లి మండల కేంద్రంలోని వేములవాడకు వెళ్లే రహదారి గల కల్వర్టు వంతెన చెత్తతో నిండి పై నుండి ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బందులు అవుతున్నాయని తెలవడంతో శుక్రవారం రోజున పోలీసులు జెసిబి సహాయంతో పైపులలో ఉన్న చెత్తాహచెదారన్ని తొలగించారు.ఈ సందర్భంగా ప్రయాణికులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.



## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

**బలగం టీవీ, కరీంనగర్:**



కరీంనగర్ జిల్లా, వీణవంక మండలం, చల్లూరు గ్రామంలో లంచం తీసుకుంటూ ఓ పంచాయతీ కార్యదర్శి ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. నాగరాజు అనే ఈ కార్యదర్శిని పట్టుకోవడంతో గ్రామంలోని ప్రజలు పటాకులు కాల్చి, సంబరాలు జరుపుకున్నారు. గ్రామంలో కొత్తగా నిర్మించుకున్న ఇంటికి నెంబర్ కేటాయించడానికి నాగరాజు రూ. 20,000 లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధిత వ్యక్తి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులను ఆశ్రయించాడు. పక్కా ప్రణాళికతో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి, డబ్బులు తీసుకుంటుండగా నాగరాజును పట్టుకున్నారు.

గ్రామస్తుల ప్రకారం, పంచాయతీ కార్యదర్శి నాగరాజు నిత్యం తమను లంచాలతో పీడించేవాడని, చిన్న పని చేయాలన్నా డబ్బులు అడిగేవాడని తెలిపారు. అందుకే అతను ఏసీబీకి పట్టుబడటంతో ప్రజలు తమ కష్టాలు తీరాయని భావించి పండుగ చేసుకున్నారు.

## రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉపాధ్యాయులు, ఆయాల నియామకానికి దరఖాస్తులు

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో నూతనంగా మంజూరైన 13 పూర్వ ప్రాథమిక పాఠశాలలను ఈ విద్యా సంవత్సరం నుండి స్థానిక ప్రాథమిక పాఠశాలలో ప్రారంభించడం జరుగుతుంది. ఈ పాఠశాల ల్లోని విద్యార్థులకు బోధించడానికి గాను 13 మహిళా భోదకులు మరియు 13 మంది మహిళ ఆయాలను నియమించాలని జిల్లా కలెక్టర్ రాజన్న సిరిసిల్ల అనుమతించారు. అందుకుగాను స్థానికులైన మహిళ అభ్యర్థుల నుండి దరఖాస్తు కోరనైనది.బోధకులుగా పనిచేయుటకు గల అర్హతలు: ఇంటర్మీడియట్ మరియు తత్సమానం (పూర్వ ప్రాదమిక లేదా ప్రాదమిక విద్య కోర్సు చేసినవారికి, మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును) గౌరవ వేతనం: 8000/- ఆయాగా పనిచేయుటకు గల అర్హతలు: 7వ తరగతి ఉత్తీర్ణత కలిగిన అభ్యర్థులు. గౌరవ వేతనం: 6000/-. వయస్సు.. నోటిఫికేషన్ నాటికి 18 సంవత్సరాల నుంచి 44 సంవత్సరాల వరకు (SC/ST/BC/HWS% వారికి 5 సంవత్సరాల సడలింపు మాజీ సైనిక ఉద్యోగులకు మూడు సంవత్సరాల సడలింపు మరియు దివ్యాంగులకు 10 సంవత్సరాల సడలింపు), స్థానికులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును. దరఖాస్తులు సంబంధిత మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం, నందు తేదీ: 30.08.2025 సాయంత్రం 5 గంటల లోపు తీసుకోబడును. దరఖాస్తు పత్రాలు ఇతర వివరాలు మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం నుండి పొందగలరు.

## రాజన్న ఆలయానికి నూతన ఈవోగా రమాదేవి బాధ్యతలు

**బలగం టీవీ, వేములవాడ**



వేములవాడ శ్రీ రాజరాజేశ్వరి దేవస్థాన నూతన ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈవో)గా ఎల్. రమాదేవి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రమాదేవి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వస్తివచనాలతో ఈవోకు ఆహ్వానం పలికారు. అనంతరం కళ్యాణ మండపంలో వేదపండితులు, ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సహాయ నిర్వాహక అధికారి జి. శ్రావణ్‌కుమార్, స్వామివారి ప్రసాదం మరియు చిత్రపటాన్ని రమాదేవికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు జి. శ్రీనివాస్ శర్మ, శ్రీ వెల్ది సంతోష్, వి. వెంకట ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ ఎం. రాజేందర్, ఓ. భాస్కర్, బొడుసు మహేష్‌తో పాటు ఆలయ వేదపండితులు పాల్గొన్నారు.



## సిరిసిల్లలో బోధన అభ్యాస సామాగ్రి మేళా..

**బలగం టీవీ, సిరిసిల్ల**


విద్యార్థులకు సులభంగా పాఠాలు అర్థం చేయించేందుకు ఉపాధ్యాయులను ప్రోత్సహించే లక్ష్యంతో సిరిసిల్లలోని బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం మండల స్థాయి బోధన అభ్యాస సామాగ్రి మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ శైలజ, %ణజజుదీ% సెక్రటరీ వి.ఎం. శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ మేళాలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు తెలుగు, ఇంగ్లీష్, ఈవీఎస్, గణితం వంటి సబ్జెక్టులను బోధించడానికి ఉపయోగపడే పరికరాలను ప్రదర్శించారు. ప్రత్యేకించి, చాలా తక్కువ ఖర్చుతో లేదా అసలు ఖర్చు లేకుండా తయారు చేసిన బోధన సామాగ్రిని ఈ ప్రదర్శనలో చూపించారు. దీనివల్ల ఉపాధ్యాయులు తమ సొంతంగా బోధనా పరికరాలను ఎలా తయారు చేసుకోవాలో తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మండల విద్యాధికారి దూస రఘుపతి మాట్లాడుతూ, ఇలాంటి మేళాల నిర్వహణ వల్ల ఉపాధ్యాయులు తమ బోధనా పద్ధతులను పరస్పరం పంచుకోవచ్చుని, తద్వారా పిల్లల్లో అభ్యాసన సామర్థ్యాన్ని పెంచవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల మండల పాఠశాల కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు శారద, మోతీలాల్, శ్రీనివాస్, ఇతర ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, సీసీఓలు పాల్గొన్నారు.

## బతుకమ్మ ఘాట్లు మంజూరు..

**- కృతజ్ఞతలు తెలిపిన బీసీ సెల్ అధ్యక్షులు కూస రవీందర్**

**బలగం టీవీ, బోయినిపల్లి**





తెలంగాణలో ఆడపడుచులకు అత్యంత పెద్ద పండుగ అయిన బతుకమ్మ పండుగ కాగా చివరి రోజు సద్దుల బతుకమ్మను నిమజ్జనం చేసేందుకు మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దృష్టికి బీ.సి.సెల్ జిల్లా అధ్యక్షులు కూస రవీందర్ తీసుకురాగా, మండలంలో నాలుగు బతుకమ్మ తేప్పలు మంజూరు చేశారు. మహిళలకు బతుకమ్మ ఆడుకొని దూరం ఎత్తుకొని పోవడం ఇబ్బంది అవుచున్నదని ఎమ్మెల్యే దృష్టికి కూస రవీందర్ తీసుకువెళ్ల గా వెంటనే మండలంలోని వెంకట్రావుపల్లి, మర్లపేట, గుండన్నపల్లి, కొదురుపాక గ్రామాలలోబతుకమ్మ ఘాట్లను మంజూరు చేశారు. కూస రవీందర్ ఎమ్మెల్యే సత్యం కు కృతజ్ఞతలు తెలిపారు.




## కేరళ మోడల్ స్కూల్ లో ఘనంగా యెల్లో డే వేడుకలు

**బలగం టీవీ, ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండల కేంద్రంలోని కేరళ మోడల్ ప్రైమరీ స్కూల్ యెల్లో డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పసుపు రంగు దుస్తులు ధరించి పాఠశాలకు హాజరయ్యారు. పసుపు రంగు బెలూన్లు, పువ్వులు, చిత్రాలతో తరగతి గదులను అలంకరించారు.విద్యార్థులు పసుపు రంగు పండ్లు, కూరగాయలు, పూలతో చేసిన నమూనాలను ప్రదర్శించారు. చిన్నారులు పాటలు పాడి, నృత్యాలు చేసి కార్యక్రమాన్ని ఆనందభరితంగా మార్చారు.ఉపాధ్యాయులు పసుపు రంగు ప్రాధాన్యత, అది సూర్యుడు, శక్తి, ఉత్సాహానికి ప్రతీక అని విద్యార్థులకు వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడమే ఈ వేడుకల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బిన్సీ, థెరిస్సా, లావణ్య, షాలు, చిన్మాయ్, సంధ్య, స్వప్న, ప్రీతి లు పాల్గొన్నారు.



# తెలుగు టైటాన్స్‌కు మరో ఓటమి

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రొ కబడ్డీ లీగ్(పికెఎల్) సీజన్-12లో తెలుగు టైటాన్ జట్టు వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఓటమిపాలైంది. తొలిరోజు తమిళ్ తలైవాస్ చేతిలో 3పాయింట్లతో ఓడిన టైటాన్స్.. శనివారం జరిగిన రెండో మ్యాచ్‌లో యుపి యోధాస్ చేతిలో 5పాయింట్ల తేడాతో ఓడింది. చివరి వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 35-40పాయింట్ల తేడాతో పరాజయాన్ని చవిచూసింది. చివరి 5నిమిషాల వ్యవధిలో పుంజుకొనేలా కనిపించినా.. అనవసర ట్యాకిల్‌తో ప్రత్యర్ధి జట్టుకు 3పాయింట్లు సమర్పించుకొని చేజేతులా మరోసారి ఓడింది. కెప్టెన్ విజరు మాలిక్(14పాయింట్లు) సాధించగా.. భరత్(3), శుభమ్(2) ట్యాకిల్స్‌లో మెరిసారు. ఇక యుపి జట్టులో గగన్(14)రైడ్ పాయింట్లు సాధించగా.. గుమన్ సింగ్ 7 రైడ్ పాయింట్లు కొట్టాడు. యు ముంబ, గుజరాత్ జెయింట్స్ జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్ 29-29పాయింట్లతో టై అయ్యింది. ఆ తర్వాత టై బ్రేకర్‌లో యు ముంబ జట్టు 6-5పాయింట్ల తేడాతో గుజరాత్‌ను చిత్తుచేసింది.


**ప్రొ కబడ్డీలో నేడు..**

తమిళ్ తలైవాస్ ఐ యు ముంబ(రా. 8.00గంటలకు)
బెంగాల్ వారియర్స్ ఐ హర్యానా స్టీలర్స్(రా. 9.00గంటలకు)

# ప్రి క్వార్టర్స్‌కు సబలెంక

**యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ**

**బలగం టీవీ, హైదరాబాద్**



యుఎస్ ఓపెన్‌లో మహిళల సింగిల్స్ ప్రి క్వార్టర్‌ఫైనల్లోకి టాప్‌సీడ్, బెలారస్‌కు చెందిన అర్యానా సబలెంకతోపాటు అన్‌సీడెడ్, రష్యాకు చెందిన క్రేజీకోవా ప్రవేశించారు. ఇక అమెరికాకు చెందిన లీతోపాటు 10వ సీడ్ నవ్రో, 5వ సీడ్ ఆండ్రీవా అనూహ్యంగా మూడోరౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. శనివారం జరిగిన మూడోరౌండ్ పోటీలో సబలెంక 6-3, 7-6(7-2)తో 31వ సీడ్, కెనడాకు చెందిన ఫెర్నాండెజ్‌ను, అన్‌సీడెడ్ క్రేజీకోవా 4-6, 6-4, 6-4తో 10వ సీడ్ నవ్రోను చిత్తుచేశారు. ఇక 5వ సీడ్, రష్యాకు చెందిన ఆండ్రీవా 5-7, 2-6తో అన్‌సీడెడ్, అమెరికా సంచలనం టౌన్సెండ్ చేతిలో ఓటమిపాలైంది.

సెర్బియా స్టార్, 24 గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల విజేత నొవాక్ జకోవిచ్ జోరు కొనసాగుతోంది. శుక్రవారం జరిగిన మూడోరౌండ్ పోటీలో జకోవిచ్ 6-4, 6-7(4-7), 6-2, 6-3తో నొర్రీ(బ్రిటన్)ను చిత్తుచేయగా.. 21వ సీడ్ మచాక్(చెక్) 7-5, 6-3, 6-1తో బాంబ్లే(ఫ్రాన్స్)ను ఓడించి ప్రి క్వార్టర్‌ఫైనల్‌కు చేరారు. మరో పోటీలో 17వ సీడ్ టఫీ(అమెరికా) 4-6, 3-6, 6-7(7-9)తో అన్‌సీడెడ్, జర్మనీకి చెందిన స్టఫ్ చేతిలో ఓటమిపాలయ్యాడు. మరో పోటీలో 4వ సీడ్, ఫ్రిట్జ్(అమెరికా) 7-6(7-3), 6-7(9-11), 6-4, 6-4తో క్రైమ్(స్విట్జర్లాండ్)ను చిత్తుచేసి ప్రిక్వార్టర్స్‌కు చేరాడు.

ఇక పురుషుల డబుల్స్‌లో భారత్‌కు చెందిన విజరు సుందర్-అనిరుధ్ చంద్రశేఖర్ జంట తొలిరౌండ్‌లో 3-6, 6-3, 6-4తో 8వ సీడ్ అమెరికా జంటను ఓడించి రెండోరౌండ్‌కు చేరగా.. మరోజంట బొల్లిపల్లి-బాలాజీ జంట 6-3, 6-7(8-10), 4-6తో అమెరికా-ఫ్రాన్స్ జంట చేతిలో ఓటమిపాలయ్యారు.




# సెమీస్‌కు సాత్విక్ ద్వయం

**బలగం టీవీ, హైదరాబాద్**

భారత బ్యాడ్మింటన్ డబుల్స్ ఆటగాళ్లు సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి పారిస్‌లో జరుగుతున్న ప్రతిష్టాత్మక బ్యాడ్మింటన్ వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో సెమీస్‌కు దూసుకెళ్లారు. భారత కాలమానం ప్రకారం శుక్రవారం అర్ధరాత్రి ముగిశాక జరిగిన మ్యాచ్‌లో భారత జోడీ.. 21-12, 21-19తో మలేసియాకు చెందిన ఆరోన్ చియ సో వుయ్ యిక్‌ను ఓడించింది. 43 నిమిషాల పాటు జరిగిన పోరులో గేమ్ ఆసాంతం ఆధిపత్యం ప్రదర్శించిన సాత్విక్ ద్వయం.. నిరుడు పారిస్ వేదికగా ఇదే జంట చేతిలో ఎదురైన ఓటమికి బదులు తీర్చుకున్నారు. సెమీస్ చేరడంతో సాత్విక్-చిరాగ్ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో పతకాన్ని కూడా ఖాయం చేసుకున్నారు. 2022లో భారత జోడీ కాంస్యం గెలిచిన విషయం విదితమే.

# ఆర్ఆర్ ప్రధాన కోచ్ పదవికి ద్రవిడ్ గుడ్‌బై

**బలగం టీవీ, హైదరాబాద్**




భారత క్రికెట్‌కు ప్రధాన కోచ్‌గా సేవలందించిన మాజీ క్రికెటర్ రాహుల్ ద్రవిడ్ ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ ప్రధాన కోచ్ పదవికి రాజీనామా చేశారు. ఈ విషయం గురించి ఆయన స్వయంగా తన సోషల్ మీడియా ఖాతా ద్వారా ప్రకటించారు. రాజీనామా చేయడం వెనుక గల కారణాలపై ఇంకా స్పష్టత లభించాల్సి ఉంది. భారత జాతీయ జట్టుకు కోచ్‌గా దాదాపు నాలుగు సంవత్సరాల పాటు సేవలందించిన ద్రవిడ్, ఐపీఎల్ 2025 ముగిసిన తర్వాత రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీతో కలిశారు. అయితే ఇటీవల కాలికి గాయం కావడంతో కట్టుతోనే జట్టు వెన్నంటి ప్రయాణించిన వీడియోలు అప్పట్లో వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలోనే ద్రవిడ్ తన కోచ్ బాధ్యతల నుండి తప్పుకున్నట్లు తెలుస్తోంది.

ఆర్ఆర్ అధికారిక ప్రకటనలో పేర్కొన్న విషయాలు:

"ఐపీఎల్ 2026 సీజన్‌కు ముందు ద్రవిడ్ రాజీనామా చేశారు. ఆయన జట్టుతో కలసి ఎంతో సమయం గడిపారు. ఆటగాళ్లపై ఆయన ప్రభావం ఎంతో గొప్పది. ఫ్రాంచైజీలో పాజిటివ్ కల్చర్‌ను నిర్మించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. మేము ఆయనకు మరింత ఉన్నతమైన పదవి అందించాలనుకున్నా, ఆయన వినయంగా తిరస్కరించారు. రాజస్థాన్ రాయల్స్ తరఫున, అలాగే మా అభిమానుల తరఫున ఆయనకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం," అని ఆర్ఆర్ తెలిపింది.

రాహుల్ ద్రవిడ్ స్థానంలో ఎవరు ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపడతారు అన్నదానిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. రాజస్థాన్ రాయల్స్‌తో పాటు భారత క్రికెట్ అభిమానుల్లోనూ ఈ విషయంలో ఆసక్తి నెలకొంది. అంతర్జాతీయ క్రికెట్‌లో తన అనుభవంతో కొత్త తరానికి మార్గనిర్దేశం చేసిన ద్రవిడ్, కోచ్‌గా తనదైన ముద్ర వేశారు. ఆయన నిబద్ధత, గంభీరత, మరియు కోచ్‌గా ఇచ్చిన మార్గదర్శనం భారత క్రికెట్‌లో చిరస్థాయిగా నిలుస్తాయి.

# అల్లు రామలింగయ్య సతీమణి కన్నుమూత

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ కుటుంబంలో విషాదం నెలకొంది. ఆయన అమ్మగారు, దివంగత హాస్యనటులు అల్లు రామలింగయ్య సతీమణి అల్లు కనకరత్నమ్మ (94) కన్నుమూశారు. వృద్ధాప్య కారణంగా అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఆమె కన్నుమూశారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే కనకరత్నమ్మ అల్లుడు అయిన చిరంజీవి, ఆయన సతీమణి సురేఖ, కుటుంబం అల్లు అరవింద్ ఇంటికి చేరుకున్నారు. రామ్‌చరణ్ మైసూర్ నుంచి, అల్లు అర్జున్ ముంబయ్ నుంచి హుటాహుటిన హైదరాబాద్‌కు వచ్చేశారు. కనకరత్నమ్మ మరణ వార్త తెలుసుకున్న అల్లు అరవింద్ సన్నిహితులు, పలువురు సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా సంతాపం తెలియజేశారు. పలువురు సినీ ప్రముఖులు అల్లు అరవింద్‌కు ఇంటికి విచ్చేసి కనకరత్నమ్మ భౌతిక కాయానికి పూలతో నివాళులర్పించారు.

ఇక కోకాపేటలోని అల్లు అరవింద్ వ్యవసాయ క్షేత్రంలో అల్లు కనకరత్నమ్మ అంత్యక్రియలు జరిగాయి. అంతకుముందు మెగా,- అల్లు కుటుంబాల అశ్రు నయనాల మధ్య ఆమె అంతిమ యాత్ర జరిగింది. ఇక కనకరత్నమ్మ పాడెను అల్లుడు అయిన చిరంజీవి, మనవళ్లు అల్లు అర్జున్, రామ్ చరణ్‌తో పాటు ముని మనవడు అయాన్ కూడా మోశాడు. అయితే కనకరత్నమ్మకు ఇద్దరు మనవళ్లు అల్లు అర్జున్, రామ్‌చరణ్ అంటే ఎంతో ప్రాణం.



అల్లు రామలింగయ్య, కనకరత్నం దంపతులకు నలుగురు సంతానం ఉన్నారనే విషయం తెలిసిందే. వారిలో అల్లు అరవింద్, కుమార్తె సురేఖ మాత్రమే సినీ ఇండస్ట్రీకి దగ్గరగా ఉన్నారు. అల్లు రామలింగయ్య 2004లో మరణించారు. అయితే, ఆయన సతీమణి కనకరత్నం మీడియాకి పెద్దగా కనిపించరు. తన భర్త అల్లు రామలింగయ్య శతజయంతి ఉత్సవాల్లో మాత్రమే ఆమె కనిపించారు.

**ఆమె మాకు ఆదర్శం: చిరంజీవి**

మా అత్తయ్య గారు.. దివంగత అల్లు రామలింగయ్య సతీమణి కనకరత్నమ్మ శివైక్యం చెందటం ఎంతో బాధాకరమని చిరంజీవి అన్నారు. ఇరు కుటుంబాలపై ఆమె చూపిన ప్రేమ, ధైర్యం, జీవిత విలువలు ఎప్పటికీ తమకు ఆదర్శంగా ఉంటాయని చెప్పారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థిస్తున్నానంటూ సోషల్‌మీడియాలో చిరంజీవి పంచుకున్నారు.

**కనక రత్నమ్మ ఐ డొనేషన్**

ఇక కనక రత్నమ్మ అంత్యక్రియలు పూర్తయిన తర్వాత సాయంత్రం ఓ హాస్పిటల్ కార్యక్రమంలో చిరంజీవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన అత్తమ్మ చేసిన ఓ గొప్ప పని గురించి అందరితో పంచుకున్నారు. ' ఈ



తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో మా అత్తగారు లేరు అనే వార్త వచ్చింది. అల్లు అరవింద్ ఇక్కడ లేరు, బెంగుళూరులో ఉన్నారు. నేను వెంటనే వెళ్లాను. ఆ సమయంలో మేము అనుకున్న ఆర్గాన్ డొనేషన్ విషయం గుర్తుకు వచ్చింది. ఆ అర్ధరాత్రి సమయంలో మా బ్లడ్ బ్యాంక్ స్వామి నాయుడుకి ఫోన్ చేసి ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో టెక్నిషియన్స్ ని కనుక్కోజజ ఈ లోపు నేను ఆవిడ ఐ డొనేషన్ కి అంతా రెడీ చేస్తాను అని చెప్పాను. వాళ్లు రెడీగా ఉంటారు వస్తారు అన్నాడు. ఈ లోపు నేను అరవింద్ కు ఫోన్ చేసి ఇలా ఇవ్వాలి అని అనుకుంటున్నాను. నాకు అత్తమ్మ గారికి, మా అమ్మ గారికి మధ్య ఒక సారి ఇదే విషయంపై మాట్లాడకున్నాం. ' మీరు ఇస్తారా' అని అడిగాను. కాలి బూడిద అయ్యే శరీరానికి చచ్చిపోయాక ఏం చేస్తాం అలాగే నీ ఇష్టం ఇచ్చేద్దాం అన్నారు. 'అవయవదానం గురించి మా అత్తమ్మ ఎక్కడా సంతకం పెట్టలేదు కానీ నాకు ఆ మాటే ప్రతిజ్ఞ లాగా అనిపించింది. ఇదే విషయమై 'ఏం చేయమంటావ్' అని అరవింద్ ను అడిగితే ఓకే చేసేయి అన్నాడు. ఇవాళ ఉదయం ఆమె కళ్లను తీసి ఆస్పత్రికి పంపించాం' అని చిరంజీవి చెప్పుకొచ్చారు ఇందుకు సంబంధించిన ఫోటోలను తన ఫోన్ లో నుంచి మీడియాకు చూపించారు మెగాస్టార్.

## 'లిటిల్ హార్ట్స్' ట్రైలర్ విడుదల

**సెప్టెంబర్ 5న థియేటర్లలోకి**

**బలగం టీవీ, హైదరాబాద్**




సోషల్ మీడియా వేదికగా తనదైన వినోదాత్మక శైలితో పాపులారిటీ పొందిన మౌళి, '90'స్ వెబ్ సిరీస్‌తో విశేషంగా ఆకట్టుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'లిటిల్ హార్ట్స్'. ఈ చిత్రంలో 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్' చిత్రం ద్వారా గుర్తింపు పొందిన శివానీ నాగారం కథానాయికగా నటిస్తున్నారు. ఈ సినిమా సెప్టెంబర్ 5న విడుదల కానున్న నేపథ్యంలో చిత్రబృందం ట్రైలర్‌ను రిలీజ్ చేసింది. "ఈ స్టోరీ జియో సిమ్ రాక ముందు జరిగింది" అనే డైలాగ్‌తో ప్రారంభమైన ట్రైలర్, మౌళి ప్రత్యేక హాస్యశైలిని ప్రతిబింబిస్తూ, యువతను ఆకట్టుకునే సందర్భాలతో నిండిగా కనిపిస్తోంది. ఇందులో కథానాయిక మౌళిని "నీకు క్యాస్ట్ ఫీలింగ్ ఉందా?" అని అడిగే సన్నివేశానికి, ఆయన "నాకు గ్రహాంతరవాసులైనా ఓకే" అంటూ ఇచ్చిన సమాధానం ప్రేక్షకుల్లో నవ్వులు పూయిస్తోంది. సినిమా ట్రైలర్ మొత్తం ప్రేమ, హాస్యం, కుటుంబ భావోద్వేగాలను మేళవిస్తూ రూపొందించబడి, ఫీల్‌గుడ్ ఎంటర్టైనర్‌గా నిలవనుందని అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రానికి సాయి మార్తాండ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆదిత్య హాసన్ నిర్మాణం వహిస్తున్న ఈ చిత్రానికి సిన్‌జిత్ యర్రమల్లి సంగీతం అందించారు.